# భీమవరంలో మెగాసందడి



మెగాస్టార్ చిరంజీవి భీమవరంలో ఉన్నారు. ఆయన నటిస్తున్న 'విశ్వంభర' చిత్రం తాజా షెడ్యూల్ భీమవరం పరిసరాల్లో జరుగుతున్నది. మామూలుగా చిరంజీవి బయటికొస్తే క్రౌడ్‌ని కంట్రోల్ చేయడం కష్టం. పైగా తూర్పు గోదావరి జిల్లా. అక్కడి జనాలకు ఆయనంటే అంతులేని అభిమానం. మరి ఆ ఏరియాలో మెగా షెడ్యూలంటే అక్కడి పోలీస్ యంత్రాంగానికి పెద్ద పనే. దొరబాబుగా వింటేజ్ మెగాస్టార్‌ని జనానికి చూపించటానికి దర్శకుడు మల్లిడి వశిష్ఠ సర్వశక్తులనూ ఒడ్డుతున్నాడు. ఇక్కడ జరిగే షెడ్యూల్‌లో కథలోని కీలక సన్నివేశాలతోపాటు ఓ భారీ యాక్షన్ ఎపిసోడ్‌ని కూడా ప్లాన్ చేశారు వశిష్ఠ. పదిహేను రోజుల పాటు ఈ షెడ్యూల్ ఉంటుందని సమాచారం. ఈ సినిమా కథ, కథనం, చిరంజీవి కేరక్టరైజేషన్ వీటితోపాటు సాంకేతిక హంగులూ అన్నీ కొత్తగా ఉంటాయని సమాచారం. కథ రీత్యా ఇందులో ఇద్దరి కంటే ఎక్కువ కథానాయికలు ఉన్న విషయం తెలిసిందే. ఓ కథానాయికగా త్రిష ఇప్పటికే ఎంపికైంది. మరో కథానాయికగా అనుష్క దాదాపు ఖరారైనట్టు సమాచారం. పంచభూతాల నేపథ్యంలో సాగే ఈ ఫాంటసీ సినిమాలో ఊహించని అంశాలుంటాయని వినికిడి. సునీల్ పాత్ర కూడా ఇందులో కొత్తగా ఉంటుందట. ఈ సినిమాకు చెందిన మరిన్ని విషయాలు తెలియాల్సివుంది.





# 'సలార్' అదనపు షోలకు అనుమతి

ప్రభాస్ కథానాయకుడిగా నటించిన 'సలార్' సినిమా అదనపు షోల నిర్వహణతోపాటు టిక్కెట్టు రేట్ల పెంపునకు ప్రభుత్వం అనుమతి మంజూరుచేసింది. రాష్ట్రంలోని 20 థియేటర్లలో 22వ తేదీ ఉదయం ఒంటిగంటకు బెనిఫిట్ షో నిర్వహణకు, అలాగే ఉదయం నాలుగు గంటలకు ఆరవ షో నిర్వహణకు అనుమతిస్తూ హోమ్‌శాఖ ముఖ్య కార్యదర్శి మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు. అలాగే, ఈ నెల 22నుంచి 28వ తేదీవరకు సింగిల్ స్క్రీన్లు, మల్టీప్లెక్స్‌లలో టిక్కెట్ రేట్లను రూ. 65, రూ. 100వరకు పెంచుకునేందుకు కూడా అనుమతించారు. అదేవిధంగా ఆంధ్రప్రదేశ్‌లో కూడా 'సలార్' సినిమా టిక్కెట్ ధరలను అన్ని థియేటర్లలో పది రోజులపాటు రూ. 40 వరకు పెంచుకునేందుకు అక్కడి ప్రభుత్వం అనుమతి మంజూరుచేసింది.



ప్రశాంత్‌వర్మ, వరలక్ష్మీ శరత్‌కుమార్, అమృత అయ్యర్, తేజ సజ్జా, కె.నిరంజన్ రెడ్డి

# అంజనాద్రి ప్రపంచంలోకి తీసుకెళ్లే హను-మాన్

ధర్మం ఉన్నచోట హనుమంతుడు ఉంటారు.. హనుమంతుడు ఎక్కడ ఉంటాడో అక్కడ విజయం ఉంటుంది.. అని తెలియజెప్పే కథాంశంతో రూపొందుతున్న చిత్రం 'హను-మాన్'. సోషియో ఫాంటసీ యాక్షన్ డ్రామాగా దర్శకుడు ప్రశాంత్‌వర్మ తెరకెక్కిస్తున్న ఈ చిత్రంలో తేజ సజ్జా, అమృత అయ్యర్ హీరోహీరోయిన్లు. వరలక్ష్మి శరత్‌కుమార్ కీలక భూమిక పోషిస్తున్నది. కె.నిరంజన్ రెడ్డి నిర్మాత. జనవరి 12న పాన్ ఇండియాతో పాటు ఇంగ్లీష్, స్పానిష్, కొరియన్, చైనీస్, జపనీస్ భాషల్లో పాన్ వరల్డ్ సినిమాగా ఇది విడుదల కానుంది. ట్రైలర్‌ని మంగళవారం హైదరాబాద్‌లో విడుదల చేశారు. ఆడియన్స్‌ని అందమైన అంజనాద్రి ప్రపంచంలోకి తీసుకెళ్లే విధంగా ఈ ట్రైలర్‌ని కట్ చేశారు. ట్రైలర్ ఆద్యంతం రామనామంతో, హనుమ తేజంతో, ఆసక్తికరమైన యాక్షన్ డ్రామాతో సాగింది. హిమాలయాల్లో హనుమంతుని సాక్షాత్కారం ఈ ట్రైలర్‌లో హైలైట్. దర్శకుడు మాట్లాడుతూ 'మనందరి ఇష్టదైవం హనుమంతుడు. ఆయనే రియల్ సూపర్ హీరో. ఈ సినిమా టీజర్ రిలీజైన తర్వాత 'హనుమంతుడు ఎవరు? ఆయన గొప్పతనం ఏంటి?' అని తల్లిదండ్రుల్ని పిల్లలు అడుగుతున్నారని తెలిసి చాలా ఆనందించాను. ఆయన పాత్రను స్ఫూర్తిగా తీసుకొని నేటి తరానికి తగ్గట్టు తయారు చేసిన కథ ఇది. దాదాపు 1500 థియటర్లలో విడుదల చేస్తున్నాం' అని తెలిపారు. మామూలు కుర్రాడికి సూపర్ పవర్స్ వస్తే, వాడు చేసే సాహసాలేంటి? అనేదే ఈ సినిమా అని తేజ సజ్జా అన్నారు. ఈ చిత్రానికి కెమెరా: దాశరథి శివేంద్ర, సంగీతం: గౌరహరి, అనుదీప్ దేవ్, కృష్ణ సౌరభ్.




సుహాస్, సంకీర్తనలపై క్లాప్‌నిస్తున్న ప్రశాంత్‌నీల్

# దిల్‌రాజు ప్రొడక్షన్స్ కొత్త చిత్రం

సుహాస్, సంకీర్తన విపిన్ జంటగా ప్రముఖ నిర్మాణ సంస్థ దిల్‌రాజు ప్రొడక్షన్స్ రూపొందిస్తున్న తాజా చిత్రం మంగళవారం ప్రారంభమైంది. సందీప్ రెడ్డి బండ్ల దర్శకత్వం వహిస్తున్నారు. హర్షిత్ రెడ్డి, హన్షిత రెడ్డి నిర్మాతలు. ముహూర్తపు సన్నివేశానికి అగ్ర దర్శకుడు ప్రశాంత్‌నీల్ క్లాప్‌నిచ్చారు. అనిల్ రావిపూడి కెమెరా స్విఛాన్ చేశారు. దిల్‌రాజు, శిరీష్ స్క్రిప్ట్‌ను అందించారు. 'బలగం' వంటి ప్రశంసనీయ చిత్రం తర్వాత దిల్‌రాజు ప్రొడక్షన్స్ న్యూటాలెంట్‌ను ప్రోత్సహిస్తూ వరుసగా సినిమాలు చేస్తున్నదని, ఈ బ్యానర్‌లో వస్తున్న నాలుగో చిత్రమిదని నిర్మాతలు తెలిపారు. ఈ సినిమాకు సంబంధించిన మరిన్ని వివరాలను త్వరలో వెల్లడిస్తామని దర్శకుడు అన్నారు. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: సాయిశ్రీరామ్, సంగీతం: విజయ్ బుల్గానిన్, దర్శకత్వం: సందీప్ రెడ్డి బండ్ల.

# ఇక నుంచి డాక్టర్ శ్రీలీల!

ఇప్పుడున్న హీరోయిన్లలో శ్రీలీల అంత బిజీగా ఏ హీరోయినూ లేదు. గత ఏడాది డిసెంబర్‌లో విడుదలైన 'ధమాకా' నుంచి ఈ ఏడాది డిసెంబర్‌లో వచ్చిన 'ఎక్స్‌ట్రా ఆర్డినరీ మ్యాన్' వరకూ పన్నెండు నెలల్లో శ్రీలీల నటించిన అయిదు సినిమాలు విడుదలయ్యాయి. అంటే రమారమీ రెండు నెలలకు ఓ సినిమా అన్నమాట. ఇది మామూలు రికార్డ్ కాదు. పైగా అన్నీ భారీ సినిమాలే. దీన్ని బట్టి శ్రీలీల ప్రభ ఏ స్థాయిలో వెలిగిపోతున్నదో అర్థంచేసుకోవచ్చు. శ్రీలీల ఎంబీబీఎస్ చదువుతున్న విషయం తెలిసిందే. ఇంత బిజీలో చదువు ఎలా సాగుతున్నది అనేది మిలియన్ డాలర్ల ప్రశ్న. ప్రస్తుతం శ్రీలీల ఎంబీబీఎస్ పరీక్షలు రాసే పనిలోవుంది. ఈ నెల 18 నుంచి 24 వరకూ ముంబయిలో ఎంబీబీఎస్ పరీక్షలు కావడంతో, షూటింగ్‌లకు బ్రేక్ ఇచ్చి ముంబయి చెక్కేసింది ఈ ముద్దుగుమ్మ. ఈ పరీక్షల్లో ఉత్తీర్ణురాలైతే యాక్టస్ శ్రీలీల కాస్తా డాక్టర్ శ్రీలీలగా మారుతుందన్నమాట. మరి హయ్యర్ స్టడీస్ అంటే మాత్రం ఈ స్థాయిలో సినిమాలు చేయడం కుదిరేపనైతే కాదు. మరి కెరీర్‌ని ఎలా ప్లాన్ చేసుకుంటుందో చూడాలి. ప్రస్తుతం శ్రీలీల చేతిలో రెండుమూడు సినిమాలు ఉన్నాయి. ఆమె నటించిన 'గుంటూరుకారం' సంక్రాంతికి విడుదల కానుంది.



# వాళ్లు డేంజరస్ క్రిమినల్స్

రాజ్‌కుమార్ హిరాణీ సినిమాలంటే చక్కటి వినోదంతో పాటు అంతర్లీనంగా గొప్ప సామాజిక సందేశం ఉంటుంది. ఆయన దర్శకత్వంలో వచ్చిన మున్నాభాయ్ సిరీస్ చిత్రాలతో పాటు త్రీ ఇడియట్స్, పీకే, సంజు చిత్రాలు భారీ విజయాలను సాధించాయి. ఈ నేపథ్యంలో షారుఖ్‌ఖాన్- రాజ్‌కుమార్ హిరాణీ కాంబినేషన్‌లో ఈ నెల 21న విడుదల కాబోతున్న 'డంకీ' చిత్రంపై ప్రేక్షకులు భారీ అంచనాలు పెట్టుకున్నారు. విదేశాలకు అక్రమంగా వలస వెళ్లాలనుకునే భారతీయ విద్యార్థుల నేపథ్య కథతో దేశభక్తి అంశాన్ని స్పృశిస్తూ ఈ సినిమాను తెరకెక్కించారు. ప్రమోషన్ కార్యక్రమాల్లో భాగంగా షారుఖ్ ఖాన్ ఈ సినిమాకు సంబంధించిన ఓ ఆసక్తికరమైన విషయాన్ని పంచుకున్నారు. విదేశాల్లో నిజమైన జైలులో కొన్ని కీలక ఘట్టాలను చిత్రీకరించామని, ఆ షూటింగ్ మరచిపోలేని అనుభవాన్ని ఇచ్చిందని తెలిపారు. ఆయన మాట్లాడుతూ 'మనదేశం జైళ్లతో పోల్చితే విదేశాల్లోని జైళ్లు చాలా డిఫరెంట్‌గా ఉంటాయి. అమెరికాలో రియల్ జైలులో షూటింగ్ చేస్తున్నప్పుడు అక్కడ శిక్షననుభవిస్తున్న ఖైదీల గురించి తెలుసుకొని షాక్ తిన్నాను. వాళ్లు డేంజరస్ క్రిమినల్స్. భయంకరమైన నేరాలకు పాల్పడ్డారు. వారి మధ్యలో షూటింగ్ చేయడం కాస్త భయంగా అనిపించింది. అయితే అందులో కొంత మంది నన్ను గుర్తుపట్టి 'షారుఖ్ షారుఖ్' అనడం కూడా వినిపించింది' అని చెప్పుకొచ్చారు షారుఖ్‌ఖాన్.



శివప్రసాద్, దీప్సిక, సుహాసిని, సందీప్‌మాధవ్

# సందేశాత్మకంగా 'మహతి'

సందీప్ మాధవ్ హీరోగా రూపొందుతున్న చిత్రం 'మహతి'. సుహాసిని మణిరత్నం, దీప్సిక కీలక పాత్రధారులు. శ్రీ పద్మిని సినిమాస్ పతాకంపై శివప్రసాద్ స్వీయ దర్శకత్వంలో నిర్మిస్తున్న ఈ చిత్రం షూటింగ్ మంగళవారం హైదరాబాద్‌లో మొదలైంది. ముహూర్తపు సన్నివేశానికి చంద్రమౌళి క్లాప్ ఇవ్వగా, పద్మ కెమెరా స్విచాన్ చేశారు. సుహాసిని మణిరత్నం స్క్రిప్టని మేకర్స్‌కి అందించగా, తొలి షాట్‌కి రాజారవీంద్ర గౌరవ దర్శకత్వం వహించారు. సినిమా బాగా రావాలని, మంచి విజయం సాధించాలని అతిథులందరూ ఆకాంక్షించారు. టైటిల్‌కి తగ్గట్టు మహిళాప్రాధాన్యత గల కథ ఇదని, ఒక క్రైమ్ చేయడం కంటే, జరుగుతున్న క్రైమ్‌ని చూస్తూ ఊరుకోవడం అన్నిటికన్నా పెద్ద క్రైమ్ అని చెప్పే కథాంశమిదని సుహాసిని మణిరత్నం చెప్పారు. 'దర్శక, నిర్మాత శివప్రసాద్ అద్భుతమైన కథ తయారు చేసుకున్నారు. నా పాత్రలో విభిన్నకోణాలుంటాయి. సుహాసినిగారితో పనిచేయడం ఆనందంగా ఉంది' అని సందీప్ మాధవ్ అన్నారు. తెలుగులో తనకిది మంచి బ్రేక్ అవుతుందని దీప్సిక నమ్మకం వ్యక్తం చేసింది. కథని బలంగా నమ్మి చేస్తున్న సినిమా ఇదని దర్శకనిర్మాత శివప్రసాద్ చెప్పారు. ఈ చిత్రానికి సంగీతం: శేఖర్‌చంద్ర, కెమెరా: రాహుల్ శ్రీవాస్తవ్.



దీపక్ సరోజ్

# నువ్వెవరో మరి..

దీపక్ సరోజ్ కథానాయకుడిగా నటించిన తాజా చిత్రం 'సిద్ధార్థ్ రాయ్'. వి.యశస్వీ దర్శకత్వం వహించారు. ఈ సినిమా నుంచి 'నువ్వెవరో మరి' అంటూ సాగే మూడో గీతాన్ని మంగళవారం విడుదల చేశారు. రధన్ సంగీతాన్నందించిన ఈ పాటకు పూర్ణాచారి సాహిత్యాన్ని సమకూర్చారు. బెన్నీ దయాల్ ఆలపించారు. హీరో మనస్తత్వాన్ని తెలియజేస్తూ ప్రేమ తాలూకు అతని ఆలోచనలకు అద్దం పట్టిందీ గీతం. విభిన్నమైన ప్రేమకథా చిత్రమిదని, ఇప్పటికే విడుదలైన టీజర్‌కు అద్భుతమైన స్పందన లభిస్తున్నదని, ప్రతిభావంతులైన సాంకేతిక నిపుణులు పనిచేశారని చిత్ర బృందం పేర్కొంది. ఈ చిత్రానికి కెమెరా: శ్యామ్ కె నాయుడు, నిర్మాతలు: జయ ఆడపాక, ప్రదీప్‌పూడి, సుధాకర్ బోయిన, కథ, స్క్రీన్‌ప్లే, మాటలు, దర్శకత్వం: వి.యశస్వీ.



# రఘుతాతాలో నవ్విస్తా..

కీర్తిసురేశ్ తెలుగు సినిమాలకు బ్రేక్ ఇచ్చేసి వరుసగా తమిళ సినిమాలు చేస్తూ బిజీగా ఉన్నది. త్వరలోనే ఆమె నటించిన 'రఘు తాతా' సినిమా విడుదల కానుంది. సుమన్‌కుమార్ దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రం పూర్తిస్థాయి కామెడీ సినిమా అని తెలుస్తున్నది. ఈ సినిమాకు సంబంధించిన గ్లింప్స్‌ని ఈ రోజు విడుదల చేశారు. ఇందులో కీర్తిసురేశ్ ఎయిటీస్‌లోని అమ్మాయిలా కనిపిస్తున్నది. 'మహానటి' సినిమాలో సావిత్రిగా పాత లుక్‌లో కనిపించిన కీర్తి సురేశ్ మరోసారి 80దశకం నాటి లుక్‌లో కనిపించడం ఆసక్తిని కలిగిస్తున్న అంశం. త్వరలో విడుదల కానున్న ఈ సినిమా గురించి కీర్తి సురేశ్ మాట్లాడుతూ ' నా కెరీర్‌లో 'రఘు తాతా' ప్రత్యేకమైన సినిమా. ఇందులో నేను కొత్తగా కనిపిస్తా. అవుట్ అండ్ అవుట్ కామెడీ సినిమా ఇది. ఇందులో దైవదర్శిని కేరక్టర్ హైలైట్‌గా నిలుస్తుంది. ఆమెతో నా సీన్స్ కడుపుబ్బా నవ్విస్తాయి. కేజీఎఫ్, కాంతారా, సలార్ చిత్రాలను నిర్మించిన హోంబలే ఫిలిమ్స్ పేషన్‌తో తీసిన చిన్న సినిమా ఇది. ఆ సంస్థకు డబ్బులు, మాకు మంచి పేరు తెచ్చే పెట్టే సినిమా అవుతుంది' అంటూ నమ్మకం వ్యక్తం చేసింది కీర్తిసురేశ్.



అంకిత, సుదీష్

# 'పాషన్' ప్రారంభం

సుధీష్ వెంకట్, అంకిత సాహ జంటగా నటిస్తున్న 'పాషన్' చిత్రం మంగళవారం హైదరాబాద్‌లో ప్రారంభమైంది. అరవింద్ జోషువా దర్శకుడిగా పరిచయమవుతున్నాడు. డాక్టర్ అరుణ్, నరసింహ, ఏ.పద్మనాభ రెడ్డి నిర్మాతలు. ముహూర్తపు సన్నివేశానికి ప్రముఖ దర్శకుడు శేఖర్ కమ్ముల క్లాప్‌నివ్వగా, అరుణ్‌కుమార్ కెమెరా స్విఛాన్ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడిన శేఖర్ కమ్ముల..'హ్యాపీడేస్' మూవీలా ఈ సినిమా కూడా యువతను ప్రభావితం చేస్తుందన్నారు. దర్శకుడు మాట్లాడుతూ 'నేను రాసిన 'పాషన్' అనే నవల ఆధారంగా ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నాం. కొత్తదనంతో కూడుకున్న కథ ఇది' అన్నారు. ఈ చిత్రానికి కెమెరా: సురేష్ నటరాజన్, నిర్మాణ సంస్థ: తోలు బొమ్మలాట ఫిల్మ్స్, రచన-దర్శకత్వం: అరవింద్ జోషువా.

# అమ్మాయి అబ్బాయి ప్రేమాట..

రవితేజ నున్న, నేహా జురెల్ జంటగా రూపొందుతోన్న చిత్రం 'రాజుగారి అమ్మాయి – నాయుడుగారి అబ్బాయి'. సత్యరాజ్ దర్శకుడు. రామిశెట్టి సుబ్బారావు, ముత్యాల రామదాసు నిర్మాతలు. త్వరలో సినిమా విడుదల కానుంది. ఈ సినిమాకోసం రెహమాన్ సాహిత్యంతో, రోషన్ సాలూరి సంగీతంతో, సాహితి చాగంటి ఆలపించిన 'ధిర ధిరనా..' అంటూ సాగే పాటకు సంబంధించిన లిరికల్ వీడియోను మేకర్స్ విడుదల చేశారు. యువతరాన్ని ఆకట్టుకునేలా ఈ పాటను చిత్రీకరించడం జరిగిందని, నేటి కుర్రకారుకి కొత్త అనుభూతిని పంచే సినిమా ఇదని చిత్ర బృందం చెబుతున్నది. అతి త్వరలో ట్రైలర్‌ని, త్వరలో చిత్రాన్ని విడుదల చేస్తామని నిర్మాతలు తెలిపారు. నాగినీడు, ప్రమోదిని, జబర్దస్త్ బాబీ, తదితరులు ఇతర పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: మురళికృష్ణవర్మ.

